# కొత్త చిగుళ్లు

ఉయ్యాల వూగుతోంది. కుర్రవాడు ఏడుస్తున్నాడు. తల్లి సముదాయించ టానికి ప్రయత్నించి ప్రయత్నించి చివరకు విసుగెత్తి యేమీ తోచక దిగాలుపడి కూర్చుంది. ఇంతకూ వాడా మొండిఏడుపు యెందుకు లంకించు కున్నట్టు? ఎంతో పెద్దసమస్యయినా తీవ్రంగా కూర్చుని ఆలోచిస్తే మేధస్సుకు సమాధానం దొరకకపోదు. కాని ప్రస్తుతం ఆమెపరిస్థితి అగమ్యగోచరంగా వుంది. రోజూ అలవాటు ప్రకారమే యీ నాడూ గోరువెచ్చని నీరుపోసి స్నానం చేయించింది. తుడిచి లాలించి కడుపార పాలిచ్చి ఊయలలో పడుకో బెట్టింది. అకస్మాత్తుగా వాడు ఏడుపు అందుకున్నాడు. ఊపింది, జో కొట్టింది, లాలిపాటలు పాడింది, ఎన్నోవిధాల నిద్రపొమ్మని సజావుగా చెప్పిచూచింది. కాని లాభం మాత్రంలేదు. వాడు ఏడుపు యిప్పట్లో ఆపేట్టు లేడు.

తల్లి యేం చేస్తుంది? ఎత్తుకొని తిప్పినా ఏడుపు తగ్గలేదు. ఎందుకు వాడికాకష్టం? ఎందువల్ల ఆ దుఃఖం?

తల్లికి ఏడుపు వచ్చింది. కాని తనుకూడా ఏడిస్తే కుర్రవాడు మరీ బేజారెత్తిపోతాడని వూరుకుంది. తరుణోపాయం దొరకటంలేదు. ఏమిటి దారి?

వాడికి నిద్ర రావటం లేదు గావును. అయితే ఆడుకోరాదా? తీరి కూర్చుని యీ ఏడుపు దేనికి?—ఒకక్షణం కోపంవచ్చింది—కాని తన పకారణం యేమిటో తెలీక మళ్ళీ తగ్గింది. వేలెడులేని పసికందు మీదనా తనకోపం? వాడికేం కష్టం కలిగి ఏడుస్తున్నాడో మరి!

యేమికష్టం కలిగింది? తనకు తెలిదా? తెలుసుకుని కష్టం తొలగిం చాల్సిన బాధ్యత తనది.

అరగంటసేపు నిర్విరామంగా ఏడ్చి అలసట పొందాడువాడు. ఎక్కడ హైరాణవచ్చి పడుతుందో, స్పృహతప్పిపోతాడో అని తల్లిభయం. కాని ఆలోచన పారదు. చివరకు కుర్రాడు ఏడవటం చేతకాక ఆపేశాడు. తల్లికి చాలా సంతోషం కలిగింది. అయితే యెందుకు ఏడ్చినట్టు, యెందుకు మానినట్టు అని అర్థంకాలేదు. పోనీతే ఏడుపుమానాడంతేచాలు అని వూరుకుంది.

కుర్రవాడు నిద్రపోతున్నాడు. తండ్రి యింటికి వచ్చాడు. అడుగులు ధబీమని చప్పుడవుతున్నాయి. తల్లి యెదురువచ్చి "గట్టిగా అడుగులు వెయ్యకండి. కుర్రాడు లేస్తాడు-యిప్పుడే ఏడ్చి ఏడ్చి నిద్రపోయాడు" అన్నది. "అయితే అంత చేటెందుకు ఏడిపించావు?" అన్నాడు తండ్రి.

"నేనేడిపించానా ఏమిటి? వాడే—"

"పోనీ వాడు ఏడుస్తోంటేమాత్రం చూస్తూ వూరుకున్నావన్నమాట!"

"మీ ఆక్షేపణ మరీ బాగుంది! చాలుగాని భోజనానికి లేవండి. పొద్దెక్కిపోతోంది."

ఇంట్లో ఎవరూ అడుగులు గంభీరంగా వేసేందుకు లేదు....గట్టిగా మాట్లాడుకుందుకు లేదు. నవ్వటానికి లేదు....ఏంచేసినా కుర్రవాడికోసం, వాడి ఆటపాటలకోసం వాడి ఆనందోల్లాసాల కోసమే చెయ్యాలి.

కుర్రవాడంటే తండ్రి ప్రాణం యిస్తాడు. తల్లి సర్వమూ ఇస్తుంది. కుర్రడి సుఖం కోసం యేం చెయ్యటానికి వెనుదియ్యరు.

ఒకనాడు తల్లిదండ్రులకు పాపిష్టిరోజు-కుర్రవాడికి జ్వరం తగిలింది. ఎంచేతతగిలింది? ఎవరూ యెరగరు. మంచి డాక్టరు వచ్చి గొప్ప మందులు యిచ్చాడు. "యేమీ భయంలేదు. రెండురోజుల్లో నార్మలుకు వస్తుంది"న్నాడు. తల్లికి ఒకటే బెంగ—ఎందుకు వచ్చిందో యీ అరిష్టం అని.

వారం రోజులు అదే తీరుగా జ్వరం, నార్మలుకు రాదు. వొళ్లు కొలిమి లాగ మంట. తల్లిదండ్రులు అన్నం తినరు. నీళ్ళు ముట్టరు. ఏమీ చెయ్యరు. కుర్రవాడి పక్కమీదే చెరొకవేపూ దిగాలుపడి చూస్తూ నిట్టూరుస్తూంటారు. ఎనిమిదోరోజు కుర్రవాడి ప్రాణం అనంతవిశ్వంలో కలిసిపోయింది. తల్లికి మతి చలించిపోయింది. తండ్రికి గుండె బద్దలయింది.

ఇంటో వూయలలేదు. లాలిపాటలు లేవు. నవ్వులాటలు లేవు. స్మశానంలాగ చీకటి. సన్యాసుల్లాగ భార్యా భర్తలు.

తల్లి మరీ ఖేదించిపోయింది. ఎంతో బలవంతంమీద రెండు మెతుకులు తింటుంది. తండ్రి తొందరగానే చేకూరాడు. గుండె నిబ్బరం చేసుకొన్నాడు. తనకు బిడ్డలే కలగలేదనుకున్నాడు. దోషప్రకటకనాత్మకపుటాలోచనలు జీర్ణించుకున్నాడు. తల్లిమాత్రంకొయ్య, పలకదు. చైతన్యంలేని విగ్రహం.

"ఎన్నాళ్ళట్లా విచారంతో కుమిలిపోతావు. నీకసలు పిల్లవాడే కలగలేదనుకో" అంటాడు తండ్రి.

"ఎట్లా అనుకోను? కళ్ళు తెరుచుకున్నా, మూసుకున్నా వాడే కనిపిస్తున్నాడు నాకు. మర్చిపోవటం యెట్లా?"

"ఎందుకు దిగులు. ధైర్యంగావుండు. జీవితంలో అనుభవించాల్సిన కష్టాల్లో యిదెన్నోవొంతు? యింతమాత్రానికే—"

ఎన్నో చెబుతాడు భర్త. ఎట్లానయినా మళ్ళీ ఆమెను యీ ప్రపంచంలో ప్రాణిగా చేద్దామని తీవ్రకృషి చేస్తాడు. ఎంతసేపూ అతని ఆశ ఫలించేట్టు కనిపించదు.

కొన్నాళ్ళకు ఒకనాడు మామూలు ప్రకారం యిట్లా అన్నాడు: "నువ్విట్లా విచారంతో చిక్కిపోతోంటే నేను చూస్తూ వూరుకోలేను కాస్త

ఆలోచించు. ఎందుకింత బెంగ? ఒక్క సంవత్సరం ఓపికపట్టి మామూలుగా వుండు—మళ్ళీ ఒక కొడుకు పుడతాడు. దిగులు మింగెయ్యి. నా మాట నమ్ము.''

లలనాంగి కళ్ళల్లో ఆశ చిగుర్చింది. భర్తను ప్రేమతో కౌగలించింది. జీవితాలు రథచక్రాలలా దొర్లుకుపోతున్నాయి. *

(తెలుగు స్వతంత్ర)